క్లుప్తంగా

దుర్గాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో పురాతన ఆలయమైన శ్రీభ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్తికమాస నక్షత్రదీక్షా మహోత్సవాల సందర్భంగా ఆలయంలో శనివారం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ భ్రమరాంబ అమ్మవారి శ్రీ దుర్గాదేవిగా అలంకరణ చేసి పూజలు చేశారు. అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచ హారతులు అనంతరం చతుర్వేద స్వస్తి కార్యక్రమాలను నిర్వహించారు. అయ్యప్పస్వామి వారి సన్నిధిలో మాలధారణ, ఇరుముడి నిర్వహించిన అనంతరం దీక్షాపరులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలంటూ ఆందోళన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్మార్ట్‌మీటర్లను రద్దు చేయాలని సీపీఎం పశ్చిమ నగర కార్యదర్శి బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో శంకర్‌కేఫ్ సెంటర్‌లో శనివారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా బోయి సత్యబాబు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతిపరులను కాపాడుతున్నాయని మండిపడ్డారు. దేశసంపద లూటీ ద్వారా అదానికి సంపద పెంచి, ప్రజలపై భారం వేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నగర నాయకులు కె.సూరిబాబు, ఈవీ నారాయణ, జి.వెంకట్రావు, వీహెచ్ దాసు, డి.రమణ, రామారావు, గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ సదస్సుకు ఎంపిక

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచ ప్రఖ్యాత భారతీయ గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించనున్న జాతీయ గణితశాస్త్ర సదస్సుకు కేబీఎన్ కళాశాల గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జీ సీతారత్నం రాసిన పరిశోధన పత్రం ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి తెలిపారు. గణితశాస్త్రంలో సమాచార వ్యవస్థ వాడకంపై అమలాపురానికి చెందిన గణిత విద్యావేత్త డాక్టర్ టీఎస్‌వీఎస్ సూర్యనారాయణమూర్తితో కలిసి పరిశోధన పత్రాన్ని సీతారత్నం తయారు చేసినట్లు వివరించారు.

90 మందికి కంటి పరీక్షలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం మసీదురోడ్డులోని ఎస్‌ఎంఎ ఖుద్దూస్ ఉర్దూ హైస్కూల్‌లో మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది 90మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావు, పాఠశాల హెచ్‌ఎం ఉమర్ అలీ పాల్గొన్నారు.

నగరవాసులు పన్నులు చెల్లించండి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు వీఎంసీకి చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, నీటి పన్ను, డ్రైనేజీ పన్నులను చెల్లించాలని వీఎంసీ డిప్యూటీ కమిషనర్(రెవెన్యూ) సుజన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వీఎంసీకి చెల్లించాల్సిన అన్ని రకాల పన్నులు మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న క్యాష్ కౌంటర్లలో సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

వేదోక్తంగా సంప్రోక్షణ కార్యక్రమాలు

విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో శ్రీ భోగ శ్రీనివాసమూర్తి సంప్రోక్షణ కార్యక్రమాలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆగమ శాస్త్ర పండితులు నల్లూరి మోహన రంగాచార్యులు పర్యవేక్షణలో వైభవంగా జరుగుతున్నాయి . వైదిక కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా యాగశాలను నిర్మించారు. పుణ్యాహ వాచనం, అకల్మష ప్రాయశ్చిత్తహోమం, పంచగవ్య ప్రసాన, రక్షాబంధన హారతి, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలు ఆగమోక్తంగా నిర్వహించారు. ఆగమ శాస్త్రపండితులు రంగాచార్యులు మాట్లాడుతూ దేవాలయాలో నిర్వహించే పూజలు, యాగాలు, క్రతువులు ఆగమ శాస్త్ర ప్రకారమే జరుగుతాయని చెప్పారు. కామకన భట్టార్, ఆర్‌బీఎమ్‌కే అయ్యన్న, సూర్యకుమారాచార్యులు సంప్రోక్షణ కార్యక్రమంలో సహకరించారు.

కచ్చా డ్రెయిన్ల కష్టాలు ఇంకెన్నాళ్లు?

- కోతకు గురవుతున్న కాలువ అంచులు
- ఖాళీ స్థలాల్లోకి చేరుతున్న మురుగు నీరు
- భారీవర్షం కురిస్తే అంతా ఏకమే
- ఇళ్లల్లోకి వస్తున్న విషపు పురుగులు
- చోద్యంచూస్తున్న వీఎంసీ అధికారులు



కబేళా మెయిన్‌రోడ్డులో కోతకు గురైన కచ్చా డ్రెయిన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గంలోని గట్టువెనుక ప్రాంతంలో కచ్చా డ్రెయిన్లతో జనం అవస్థలుపడుతున్నారు. ఈ డ్రెయిన్ల కారణంగా కాలువ అంచులు (రోడ్లు) కోతకు గురవుతున్నాయి. దీంతో ఆయా రోడ్లు కుంచించుకుపోతున్నాయి. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా కచ్చా డ్రెయిన్లు ప్రమాదకరంగా మారడంతో రాకపోకల సమయంలో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి డ్రెయిన్‌లోకి వెళ్లిపోతున్నాయి. ముఖ్యంగా పాదచారులు కాలువలో పడిపోతున్న సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి.

ప్రమాదభరితంగా డ్రెయిన్ అంచులు...

ఎందుకంటే డ్రెయిన్‌లోని మురుగునీటి పారుదలకు ఓ హద్దు అంటూ లేకపోవడంతో అంచులు కోతకు గురయ్యాయి. దీంతో రోడ్డు కుంచించుకుపోవడంతోపాటు డ్రెయిన్ పొడవున పక్కనే ఉన్న ప్రదేశం మెత్తకబారి ఆదమరిచి కాలు వేస్తే దిగబడిపోతోంది. నగరపాలక సంస్థ కమిషనర్‌తో సహా అధికారులు కచ్చా డ్రెయిన్లు ఉన్న ప్రాంతాల్లో పర్యటిస్తున్నప్పటికీ వాటి గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నా..సరే చూస్తాం అంటూ హామీ ఇస్తున్నారేతప్ప సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

వర్షాకాలంలో మరింత ఇబ్బందులు...

భారీవర్షం కురిస్తే కచ్చా డ్రెయిన్ నిండిపోయి ఆ మురుగునీరంతా రోడ్డుపై ప్రవహిస్తూ ఉంటుంది. దీంతో డ్రెయిన్, రోడ్డు ఏకమై పోయి డ్రెయిన్ ఎక్కడ ఉందో కూడా కనిపించని పరిస్థితి. అటువంటి సమయాల్లో పొంగిపొర్లే డ్రెయిన్లలోని మురుగునీటిలో నుంచి వచ్చే విషపు పురుగులు ఇంటి వాడకం నీరు బయటకు పోయేందుకు ఏర్పాటు చేసుకున్న అవుట్‌లెట్ల ద్వారా ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయి. ఐదేళ్ల కిందట ఊర్మిళానగర్‌లో బాలుడు విషపు పురుగు కుట్టడంతో ఓ బాలుడు మృతిచెందాడు. అదే సిమెంట్‌తో నిర్మించిన పక్కా డ్రెయిన్ అయితే మురుగునీటి పారుదలకు ఒక కట్టడి ఉండి తమకు ఇబ్బంది లేకుండా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఇక తుఫాన్లు, వరదలు వస్తే పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుతోంది. ఇటీవల సంభవించిన బుడమేరు వరద అందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచిందనే చెప్పవచ్చు.

పక్కా డ్రెయిన్లు నిర్మించాలి...

భవానీపురం చర్చి సెంటర్ నుంచి ఊర్మిళానగర వెళ్లే రోడ్డులో కుడివైపు కొంత మేర మాత్రమే పక్కా డ్రెయిన్ ఉండగా రామాలయం దగ్గర నుంచి చివరి వరకు కచ్చా డ్రెయిన్ మాత్రమే ఉంది. స్థానిక ట్రాంబ్వే రోడ్డులోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ నుంచి, అలాగే జోజినగర్ రోడ్డులోని అవుట్‌ఫాల్ డ్రెయిన్ నుంచి వచ్చే మురుగు నీరంతా ఊర్మిళానగర్ చివర ఉన్న కల్వర్ట్ దగ్గరకు చేరుకుంటోంది. అక్కడ కూడా పక్కా నిర్మాణం లేకపోవడంతో రోడ్డు కోసుకుపోతోంది. అదేవిధంగా విద్యాధరపురం సితార జంక్షన్ నుంచి ఉన్న పక్కా అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా వచ్చే మురుగునీరు కబేళా సెంటర్‌లోని కల్వర్ట్ దగ్గరకు చేరుతోంది. అక్కడ నుంచి రామరాజ్యనగర్ వైపు (సీవీఆర్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్) వెళ్లే డ్రెయిన్ కచ్చా డ్రెయిన్‌గా కావడంతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే కబేళా సెంటర్‌లో కచ్చా డ్రెయిన్ కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అలాగే కబేళా రోడ్డులో ఉన్న జెఎన్‌ఎన్ యూఆర్‌ఎం గృహ సముదాయం వద్ద మాత్రమే చిన్నపాటి కాలువ నిర్మించారు. మిగతా రహదారి మొత్తం కచ్చా డ్రెయినే. ఇకనైనా విజయవాడ నగరపాలకసంస్థ అధికారులు స్పందించి కచ్చా డ్రెయిన్ల స్థానంలో సీసీ పక్కా డ్రెయిన్లను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



ఊర్మిళానగర్ మెయిన్ రోడ్ పక్కనున్న కచ్చా డ్రెయిన్



ఊర్మిళానగర్ కల్వర్ట్ వద్ద కోతకు గురైన కచ్చా డ్రెయిన్ అంచు



కబేళా సెంటర్ నుంచి ఆర్ఆర్‌నగర్ వెళ్లే కచ్చా డ్రెయిన్

హెడ్‌వాటర్ వర్క్స్ పరిశీలన



ఫ్లో మీటర్‌ను పరిశీలిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇటీవల సంభవించిన కృష్ణా, బుడమేరు వరద కారణంగా విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని డాక్టర్ కెఎల్ రావు మున్సిపల్ హెడ్‌వాటర్ వర్క్స్‌లోని పలు పరికరాలు నీటమునిగి పాడైపోయాయి. ఈ నేపథ్యంలో హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి నగరంలోని ఏడు మంచినీటి రిజర్వాయర్లకు సరఫరా చేసే రక్షిత మంచినీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వరద ఉధృతికి హెడ్ వాటర్ వర్క్స్‌లో దెబ్బతిన్న ఫ్లో మీటర్లు, ఎల్‌ఓటీ, ఐఈఈడి పరికరాలు, చార్జర్లు, బ్యాటరీలు దెబ్బతిన్నాయి. దీంతో 38వ డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు షేక్ హయాత్ షరీఫ్ సమస్యను స్టాండింగ్ కమిటీ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈమేరకు శనివారం నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, బాపతి కోటిరెడ్డి, శర్వాణి మూర్తి అధికారులతో కలిసి హెడ్‌వాటర్ వర్క్స్‌ను సందర్శించారు. ఈసందర్భంగా స్టాండింగ్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని రిజర్వాయర్లకు సంబంధించి సరఫరా అవుతున్న మంచి నీటి వృథా నివారించడంలో భాగంగా వరద కారణంగా పాడైపోయిన పరికరాలను మార్చడం తప్పనిసరని భావించి పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. వరద తాకిడికి దెబ్బతిన్న పరికరాలను రీ ప్లేస్‌మెంట్ చేసి ఇనస్టాలేషన్ చేయడం, టెస్టింగ్ అండ్ కమిషన్ ఆన్‌లైన్ విధానాన్ని పర్యవేక్షించడం, రిజర్వాయర్లను సాధారణ స్థితిలో ఉంచే నిమిత్తం అధికారులు రూ.49.95లక్షల ఖర్చును అంచనా వేసి వీఎంసీ స్టాండింగ్ కమిటీ ముందు ఆమోదం నిమిత్తం ఉంచారని వివరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఈఈ వెంకటేశ్వరరెడ్డి, ఏఇ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



పుస్తకాలను పంపిణీ చేస్తున్న సతీష్ తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి మాజేటి సతీష్ సూచించారు. బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన హిందూహైస్కూల్ విద్యార్థులకు శనివారం ఎస్‌కేపీవీవీ హిందూహైస్కూల్స్ కమిటీ సభ్యుడు వంకదారు వాసుదేవరావు ఆధ్వర్యంలో రెండు వేల నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. గతేడాది పదోతరగతి పరీక్షల్లో స్కూల్‌లో ప్రథమస్థానంలో నిలిచిన లావణ్యకు ఇంటర్మీడియట్ ఫీజు నిమిత్తం కేఎల్వీ మోహనరావు రూ.పదివేలను అందజేశారు. కార్యక్రమానికి పాఠశాల కార్యదర్శి కేఎల్వీ మోహనరావు అధ్యక్షత వహించగా, ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, ఉపాధ్యాయుల ప్రతినిధి బీబ్రహ్మేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యాయులు జె.ఆనందకుమార్, కె.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, చెక్కా జితేంద్ర వెంకటరమణ కుమార్, ఎస్. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో డ్రోన్ సర్వేలెన్స్‌పై సమీక్ష



డాక్టర్ సురేష్‌బాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో నిర్వహిస్తున్న సర్వేలెన్స్‌లో భాగంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు పారిశుద్ధ్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు డ్రోన్ సర్వేలెన్స్ చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ డ్రోన్ సర్వే ద్వారా గమనించిన వ్యర్థాలను తొలగించేందుకు 286 సచివాలయాల శానిటరీ సెక్రటరీలు సంసిద్ధులు కావాలన్నారు. డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచే విధానంలో పాటించాల్సిన అంశాలను చర్చించారు. సమావేశంలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ రామకోటేశ్వరరావు, డాక్టర్ బాబు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టాలి



ఇండస్ట్రియల్‌టూర్‌కు వెళ్తున్న విద్యార్థులతో లెక్చరర్లు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): విద్యార్థులు పరిశ్రమలపై ఆసక్తిని పెంచుకొని వాటి స్థాపనకు దృష్టి సారించాలని పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శరవణకుమార్ సూచించారు. కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరిలోని శాస్త్రిబామ్ పరిశ్రమలను శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారి పర్యటనను ప్రారంభించిన డాక్టర్ శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చుట్టూ ఉన్న పరిశ్రమలను పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్, ఉత్పత్తి అంశాలు వంటి అనేక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఎంబీఏ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగటానికి కృషి చేయాలని సూచించారు. విభాగాధిపతి డాక్టర్ వీ విజయదుర్గాప్రసాద్, అధ్యాపకులు ఎస్‌డీ జరీనాబేగంపాల్గొన్నారు.

భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఆచార్య డీవీ రమణమూర్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవటం ద్వారా ఎంచుకున్న రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించవచ్చని ప్రముఖ కమ్యూనికేషన్ స్కిల్స్ ట్రైనర్, పాజిటివ్ బిహేవియరల్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ సొల్యూషన్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ఆచార్య డీవీ రమణమూర్తి సూచించారు. కేబీఎన్ పీజీ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో 'కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పాజిటివ్ యాటిట్యూడ్' అంశంపై శనివారం గౌరవోపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన ఆచార్య రమణమూర్తి మాట్లాడుతూ సమర్థమైన సమాచార ప్రసార నైపుణ్యాలు, సానుకూల దృక్పథం కలిగిఉంటే వృత్తితోపాటు వ్యక్తిగత జీవితంలోనూ అనేక విజయాలు సాధించవచ్చన్నారు. కమ్యూనికేషన్ అంటే కేవలం సమాచారాన్ని అటూ ఇటూ పంపించడం కాదని, సమస్యల పరిష్కారానికి అదొక ఉత్తమమైన మార్గమని చెప్పారు. పాజిటివ్ యాటిట్యూడ్ కలిగిఉండటం అన్నిటికన్నా ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీ కృష్ణవేణి, పీజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మధురంగా యువ సంగీత సమ్మేళనం

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంగీత కార్యక్రమాలు శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటాయి. తిరుపతి సోదరులుగా ప్రసిద్ధి చెందిన యువ సంగీత కళాకారులు తుమ్మలూరి సంపత్‌కుమార్, సంకీర్త కుమార్ వయోలిన్‌పై సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించి స్వరపరచిన కీర్తనలను వయోలిన్‌పై పలికించారు. అజిత్ శ్రీధర్ మృదంగంపై సహకరించారు. రెండవ కార్యక్రమంగా సోళాపురపు సోదరులు, వనమాలి, మాధవ్ వేణువుపై సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ మాట్లాడుతూ శాస్త్రీయ సంగీతానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసర ముందన్నారు. కార్యదర్శి సీవీరావ్ మాట్లాడుతూ ఏటా యువ సంగీత కళాకారులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. యువ సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

యుగంధరాచార్యకు భారత్ విద్యావిభూషణ్ అవార్డ్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూరపాటి పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గానుగుల యుగంధరాచార్య నిత్యవిద్యార్థిగా రెండు డాక్టరేట్లతో కలిపి 16 డిగ్రీలు సాధించినందుకుగాను భారత్ విద్యా విభూషణ్ అవార్డ్ అందజేస్తున్నామని డీకే ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సి.అశోక్ కుమార్ శనివారం తెలిపారు. నవంబర్ 24వ తేదీన పెరంబలూరులో జరగనున్న 13వ ఇండో అమెరికన్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో 'నేటి విద్యావిధానం చేయవలసిన మార్పులు' అనే అంశంపై యుగంధరాచార్య మాట్లాడనున్నారని వివరించారు. కాలిఫోర్నియా యూనివర్సిటీ డీన్ డాక్టర్ రఘునాథ్‌పరక్కల్, ఫ్లోరిడాయూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సురేషా నర్సావి, జార్జియా గ్రిగోల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుకుమార్ చేతుల మీదుగా అవార్డు అందజేస్తామని తెలిపారు. అవార్డుకు ఎంపికైన యుగంధరాచార్యను పాఠశాల కమిటీ సభ్యులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తమ కుమార్తె కనిపించడం లేదంటూ విశాఖపట్నంకు చెందిన ఓవ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై సూర్యారావుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు విశాఖపట్నంలో నివసిస్తున్న తమ్మినేని శ్యామలరావు కుమార్తె విజయవాడ లబ్బీపేటలోని ఓ అకాడమిలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటూ సంస్థకు చెందిన హాస్టల్‌లో ఉంటుంది. అయితే అక్కడ తనకు నచ్చలేదని చెప్పడంతో తండ్రి అదేప్రాంతంలోని మరో హాస్టల్‌లో జాయిన్ చేశారు. ఈ క్రమంలో ఈనెల 22న ఆమె తనకు ఆరోగ్యం బాగాలేని కారణంగా స్నేహితులు ఓ నర్సింగ్ హోమ్‌లో చేర్పించి ట్రీట్‌మెంట్ ఇప్పిస్తున్నారని తండ్రికి ఫోన్ చేసి చెప్పింది. సాయంత్రం 6 గంటలకు తండ్రికి మళ్లీ ఫోన్‌చేసి హాస్పిటల్ ఫీజు నిమిత్తం నగదు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది. ఆ తరువాత తండ్రి, తన కుమార్తెకు ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. అనంతరం కొద్దిసేపటికి ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. హాస్టల్ యాజమాన్యానికి ఫోన్ చేసి అడగగా ఇంకా హాస్టల్‌కు రాలేదని బదులిచ్చారు. బాలిక తండ్రి విజయవాడ వచ్చి హాస్టల్ వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం విజయవాడలోని నందకుమార్ డ్యాన్స్ ఇన్స్టిట్యూట్‌కు చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై కె.చైతన్య శిష్యబృందం పలుకీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. చిన్నారులు రిషిక, లాలస, లలన, హేతిక, నాగ భవానీ, సుదీక్ష, దీక్ష, లిఖిత, తనిష్క, ధనశ్రీ, జానులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ డీఈవో రత్నరాజు ప్రసాదాలను అందజేశారు.

మల్లేశ్వరస్వామి సన్నిధిలో సహస్ర లింగార్చన

కార్తిమాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి సన్నిధిలో సహస్ర లింగార్చన చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారికి విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు.



సహస్ర లింగార్చన చేస్తున్న అర్చకులు

ప్రేమించి పెళ్లి చేసుకుని వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇన్‌స్టాగామ్‌తో పరిచయం ప్రేమగామారడంతో వివాహం చేసుకున్న కొద్ది నెలలకే బాలికను భర్త, ఆడపడుచు వేధిస్తున్నారంటూ శనివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు జిల్లా వంగాయిగూడెంకు చెందిన నాగిరెడ్డి రేష్మకు ఇద్దరు సంతానం. కుమార్తె నాగిరెడ్డి పద్మావతి (16) పదోతరగతి పరీక్షలు ముగిసిన తరువాత తల్లి మొబైల్‌లో ఇన్‌స్టాగామ్‌లో తల్లిదండ్రులకు తెలియకుండా విజయవాడకు చెందిన వల్లభ రాంపండుతో చాటింగ్ చేసింది. జూన్ 29న ఇంట్లో ఎవరూలేని సమంలో పద్మావతి ఇంట్లోంచి వెళ్లిపోయి రాంపండును వివాహం చేసుకుంది. ఈ నెల 15వ తేదీన పద్మావతి తల్లి రేష్మకు ఫోన్‌చేసి రాంపండు, వాళ్ల అక్క నాగేంద్ర ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారని, తనఇష్టం లేకపోయినా సంసారం చేయాంటూ ఇబ్బందిపెడుతున్నాడని, డబ్బులు తీసుకురావాలంటూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు తెలిపింది. దీంతో రేష్మ శనివారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకటన

నా క్లయింటు M/s. Shriram Finance Ltd., AVANIGADDA BRANCH వారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ విద్యాధరపురం కాపురస్తులు బొల్లు నాగేశ్వరరావు గారి భార్య బొల్లు పద్మావతి గారు విక్రయ దస్తావేజు నెం.12535/2017 (యస్.ఆర్.ఒ.. విజయవాడ) ద్వారా పొందిన ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని మార్టగేజ్ చేసుకొని బొల్లు నాగేశ్వరరావు గారి పేరు మీద లోను పొందనున్నారు. సదరు బొల్లు నాగేశ్వరరావు గారి పేరు మీద లోన్ ఇవ్వుటకు ఎవరికైనను ఏటువంటి కోర్టు ఎటాచ్ మెంట్లు గాని, [illegible] గాని మరియు ఏ ఇతర అభ్యంతర రూములు [illegible] వారి అభ్యంతర మూలకు ఈ క్రింది అడ్రస్సుకు 7 రోజులలో Regd. Post with Ack Due ద్వారా తెలియజేయగలరు. ఆపై వచ్చు క్లయిమ్‌లు గాని, అభ్యంతరములు గాని, నా క్లయింటును బైండ్ చేయజాలవని యావన్మందికి తెలియజేయడ మైనది.

షెడ్యూలు: యస్.టి.ఆర్. జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రారు వారి ఉలాకా, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన విజయవాడ టౌన్, భవానిపురంలోగల ఆస్తికి భవానిపురం గ్రామ ఆర్.యస్.నెం. 28/1 సబ్ డివిజన్ దాఖలా ఆర్.యస్.నెం. 28/1ఎ ఎ.ఎల్.టి. అసెస్మెంటు నెం. 30885/271/ఎ.ఎల్.టి. దాఖలా ఉత్తరం వైపునగల చ.గ॥ 52.0లో వున్నటువంటి ఇంటికి హద్దులు: తూర్పు: 9 అ॥ వెడల్పుగల రోడ్డు; దక్షిణం: [illegible] బొల్లి యల్లారావుగారికి విక్రయించిన మిగతా ఆస్తి; పడమర: బాజి సాహెబ్ గారి ఆస్తి; ఉత్తరం: ఇతరుల ఆస్తి.

ఇట్లు

T.V.N. VASUDEVA RAO, Advocate
Gudivadavari St., VIJAYAWADA.
Ph:9849431432

డీజీ యాప్ ద్వారా బాలల భద్రత

మధురానగర్(విజయవాడసెంట్రల్): బాలల భద్రతకు హోమ్ లింక్ డీజీ యాప్ చక్కగా ఉపయోగపడుతుందని స్వచ్ఛంద సంస్థలు హోమ్ లింక్ డీజీ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా బాలల సంక్షేమ, సంస్కరణల శాఖ జిల్లా నోడల్ ఆఫీసర్ టి. జ్యోతి అన్నారు. బావాజీపేటలోని నవజీవన్ బాల భవన్ లో డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్, నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యాన శనివారం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సాఫ్ట్‌వేర్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులు పరిరక్షణకు డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్ రూపొందించిన హోమ్ లింక్ డిజి యాప్ సమర్థవంతంగా పనిచేస్తుందని చెప్పారు. వీధిబాలలు అదృశ్యమైన బాలలు, బాలలకు అందించే సేవలు, బాలల సంరక్షణా కేంద్రాలు నిర్వహించే కార్యక్రమాలు అన్ని ఒకే యాప్ ద్వారా సమాచారాన్ని భద్రపరుస్తుందని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలకు ఈ హోమ్ లింక్ డీజీ యాప్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ యాప్‌ని రూపొందించిన డాన్ బోస్కో యంగ్ అండ్ రిస్క్ ఫోరమ్ హైదరాబాద్ ప్రావిన్స్ , నవజీవన్ బాల భవన్ వారిని అభినందించారు. నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్, హబ్ కోఆర్డినేటర్ ఎం.స్వర్ణగౌరీ, జోసెఫ్ డోనాల్డ్, గోళ్ళమూడి శేఖర్ బాబు పాల్గొన్నారు.